# కవితా కౌముది

## యాదయతాంది నాయనా..! పవన్ కుమార్ గజవల్లి

నాయనా ఎట్లున్నవ్ ? పానం బాగేనా?
అవ్వెట్లున్నది... పానం బరువైతాంది బిడ్డా అనబట్టె...
బాదాయితాంది నాయనా!
పాడు కొలువు ఏం జెయ్యాలె?
నీదలి పోనొచ్చె...అస్తిని.. నాలుగు ఆరొలైనా ఉండకపోతిని... తిరిగొస్తిని...
అంతా ఉర్కుడు... ఆగమాగం...కిందకుమీదకు అయితాంది
మా బతుకులిట్లైనయ్...ఏం జేస్తం బాపూ?
నువ్వు సదవమంటివి ... కొలువుకు వొమ్మంటివి
గీ కొలువు, గీ దేశం నచ్చతలేదు నాయనా!
ఎవుసం జేసుకొని నేనాడనే వుంటుండే... మీకి కట్టం ఉండక పోతుండెనేమో!
యాదయతాంది నాయనా!
మా కత ఇట్లనే వుంటది...తియ్...
నీ పానం ఎట్లున్నది సెప్పు?
నిన్ను జూసి అవ్వ మస్తు పరేషానయితాంది
అవ్వకు నిమ్మలమని సెప్పు... ఏడుత్తాంది
గోలీలు ఏసుకొనుడు యాదుంచుకో
పానం బాగయ్యే దంక బాయికి పోకు
ఆవులు, ల్యాగలెట్లున్నయ్? మేతకు ఋగులయితాందా?
సత్తి గాడికి చెప్పిన, తోల్కవోతడు ఫికర్ గాకు
సేటుకి చెప్పిన సరుకులు తెత్తడు... నువ్వు మడిగకు వోకు
తాపతాపకు సెల్కకు వోకు ... తాటిసెట్టు కాన మస్తు బూగలున్నయ్.. జర బద్రం
ఈ సంది అది మెరకైంది, ఇంగ మడుగు సిక్కే లేదు
చిన్నక్కకు చెప్పిన సూడు, కొన్నాళ్ళు ఆడకి వోండి
బావొత్తడు తోల్కవోతడు... లొల్లి జేయకు
అల్లునింట్ల వుండటం కాందాన్ గాదనుకోకు నాయనా!

బిటాయించుకోకు నప్పతట్లోళ్ళ మాటలు ఇడిసిపెట్టు
సోంచాయించు నాయనా! కొన్ని దినాలైతే పానం సక్కగైతది
ఆడ్కి వోయి పోరగాల్లని దిట్టకు, పోరగాల్లు గాయి చేత్తరు
నీ వర్రుడు ఇయ్యాల్రేపు ఎవ్వడినడు ... అక్క కొడుకులైనా గంతె
పెద్ద బావ ముచ్చట ఇనకు ... ఇర్కుల వెడ్తడు
సిన్నక్క బిడ్డ సవర్త పండగ పెట్టు వోతలకు ఫికర్ జెయ్యకు
సిన్నక్కకు పైసలిచ్చిన, పెద్దక్కకు పైసలిచ్చిన
మిత్తీలన్ని తీర్చేసిన ...
ఐనా బాపూ ! ఇన్నేల్లసంది మిత్తిల లెక్క చెప్పకుంటివి
ఇంత బిటాయించుడు, కాందాన్ జూసుడు అవుసరమా?

యాదయతాంది నాయనా!
నా సిన్నప్పటి సంది, ఎంత కట్టమాయె నీకు
నా బిడ్డ సదవాలంటివి, కర్సు మోపేడాయె
నన్ను పట్నం పంపిన సంది, యెరుకైతాంది నాయనా!
పంటల్లేక పాయె, సెల్కలు బీడువాయె
నువ్వు, అవ్వ, అక్కలు కూలికెల్లిన దినాలు యాదికైతున్నై
పాలువోసిన రోజులు గుర్తైతున్నయి
నా కోసం బడికి వోని అక్కల చాకిరి యాదైతాంది
దిగులు వడకు, వాల్లకేం గానియ్యి, నే జూసుకుంటా !
గుట్ట కాడ సెల్క పెద్దక్కకి ఇయ్యి, గుడి కాడ సెల్క చిన్నక్కకి ఇయ్యి
బాయి కాడ పొలం ఇద్దరికి సెరి సమానంగా ఇయ్యి
నాకేమీ వద్దు బాపు! నువ్విచ్చిన సదువే నా ఆస్తి
మస్తుగైనయ్ పైసలిక్కడ... ఎంత పిల్సినా రానైతిరి
ఒక సారి... రా బాపూ...నీ కొడుకెట్లున్నడో సూద్దు గాని
ఊ అను బాపూ... ఈ సారి నిన్ను అవ్వను తోలుకొత్తా
కర్చైతదని, కష్టమైతదని లొల్లి జేయకు, సోంచాయించు నాయనా!
నాకు మీకంటే గనమైంది, పిరమైంది ఏదీ లేదు బాపు!

నీ పానం బాగయ్యే దంక పరేషానైతాంది!
పొద్దుగాల అంబలి, కుడుములు తినాలే
మద్దాన్నం తైదలన్నం, జొన్న గటుక, సల్ల కూడు మస్తు తినాలే
కల్యామాకు, కొయ్‌గూర, మెంతింటాకు, గంగావాయిల్ మస్తు యాదుంచు
తోగరుపప్పు, బుడ్డలు, పల్లీలు, దప్పడం, ఏట కూర, షాపలు మస్తు తినాలే
మోసంబి, అంగూర్, ఆపిలీసు, జాంకాయలు మస్తు మంచియి బాపు!
తొంట చెయ్యి నొప్పంటివి, తైదలు, నువ్వులు మస్తు తినాలె
శర్మ సారుకు చెప్పంటి, సూది మందు ఎయ్యనికి
ఆయన తాన లొల్లి చేయకు బాపు!
ఆయన మాటలు వినాలె... పానం బాగైతది బాపు!
పానం బాగుంచుకో బాపు! అవ్వ, నువ్వు బద్రం బాపు!

బాపు, ఇయ్యాల పిల్లలు బాపు ని యాది చేసుకునే రోజ
దీన్ని ఫాదర్స్ డే అంటరు....
శరనొత్తులు బాపు
అవ్వ,నువ్వు బాగుండాలే మీ పానం బాగుండాలె!
మేము సెప్పే శరనొత్తులు దేవర దగ్గర దీపం లెక్క
ఎన్ని సెప్పినా నీకోక రోజనిచ్చినా నీ ప్రేమ ముందు, కట్టం ముందు ఈ
శరనొత్తులు సమమైతయా?
మా మంచి కొరకు చేసింది సాలు బాపు!
ఇక కట్టం సెయ్యకు,ఆనందంగుండు!
పానం బాగుంచుకో బాపు! అవ్వ, నువ్వు బద్రం బాపు!

★★★

# స్మరలాస్యం

**కృష్ణరవళి**

జగమెంత రగిలినా ..సెగలెన్నో శరములై తాకినా
మనసెంత చెదిరినా ..
మది మొయిలై బరువుగా కురిసినా.
దిగులంత జ్ఞాపకాల నావలో కదలనీ ..
పదిలమైన నావలపు సదా సోయ తరగని వెన్నెలై సాగనీ.

ఎదలోన చిందాడు కొండవాగు నెయ్యమున
ఎలనాగ హృదిన చంద్రకాంత శిల చెమరింపున
ఎండిమోడైన ముచ్చట మరల పల్లవించనీ
ఎదలోని మౌనమే నాదమై వలపు గీతమై నినదించనీ ..

పెను గాలివానలో ..పూలవనాలు నేల వాలినా
గుండె గట్టుతెగిన మున్నేరులా పొంగినా
కన్నీటి చాలున ..కెంపు ముత్యాల ప్రోది చేయనా
నిన్నటి నెల వెలుగుకు మణిహార మేయనా ..

రెప్పపాటు జీవితం.. లిప్త పాటున ముగియు పూర్వ సంబరం
తేనెపట్టున జారు మధువు ..మిగిలిపోవు..నిన్నటి ఉత్సవ సౌరభం
..తరళింపుల తేలియాడు వెన్నెల దీపం .. ..తటిల్లతల ప్రభవించు సత్య సుందర దీపం .
.దవ్వునున్నా నిను జేరు మణిదీపమై ... నన్నూరడించు తారాడు స్మరలాస్యం

★★★

# ఆరంభానికి ముందు మల్లాప్రగడ రామారావు

వెళ్తున్నావుగా జగత్పిత వద్దకు
ఓనాలుగు ఓంకారాలు పుచ్చుకురా
పద్యాలల్లుకుంటాను.

★

రోదసినిండా బొండు మల్లెలు
కొన్నయినా కోసుకురా
నా పద్యాల్లో తురుముకుంటాను

★

వాడిమయూఖములుగలవాడు
పైన పరుగులు పెడుతున్నాడు
తపనుని కిరణాలు ఎన్నయినా పట్టుకురా
నా పద్యాలో అక్షరాలుగా మలుచుకుంటాను.

★

జనారణ్యంలో వినబడని కేకలు
నభోంతరాలు పగిలేట్టు
వాటికి చెవులప్పగించు
నా పద్యాల్లో నినదిస్తాను

★

అథఃపాతాళంట
నరాలు తెగిపోయేట్టు ఎన్నిమూలుగులో
ఏరుకురావా
నా పద్యాల్లో
ప్రతిధ్వనిస్తాను.

★★★

# రసరేఖలు శ్రీధర్ బచ్చోటి

రవ్వయును సడిలేని యీ రాత్రి యందు
ఎచటినుండియో పాట విన్పించుచుండె
ఎంత వెదకిన గానరారెవ్వరిచట
నైన కర్ణములను దాకు గానమేదొ

గాలి తరగల మెల్లన తేలియాడి
చిత్తమలరించుచుండె నా చెవిని దాకి
ఎవరు పాడిన పాట కాదేమొ యిద్ది
జననమందినదేమొ నా మనసునందె

హృదయదీర్ఘికలోనుండి యే గళమ్మొ
మృదులగానమ్ముతో నన్ను నిదుర లేపె
నిదుర కాదిది స్తంభించె హృదయమిపుడు
ఏ భయముచేత మనసు జాగృతిని వీడె?

ఏల హృదయమా యిట్లు చింతింతువీవు?
అన్నియున్నను గాని యీ యార్తి యేల?
పగలు రేయియునెనలేని వగపదేల?
మితిని మీరిన కలత రుగ్మతకు త్రోవ

అమృతగానమ్ము నా హృదయమును దాకి
బాధలను బాపి జ్ఞాన దీపమును జూపి
వెలుగు త్రోవల నడిపించవలయు నన్ను
ఎడద మేల్కొని పరితోషమెరుగవలయు

COMMENTS